క్లుప్తంగా

క్రీడలతో మానసిక వికాసం



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న నరేశ్

కడ్తాల్: ఆటలతో శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక వికాసం పెంపొందుతుందని రేవంత్ మిత్రమండలి మండల అధ్యక్షుడు గంట నరేశ్ అన్నారు. ఆదివారం మండల పరిధి ముద్వీన్ గ్రామంలో అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో రమణమోని స్నేహ జ్ఞాపకార్థం నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో మహేశ్, శ్రీను, శ్రీశైలం, నవీన్, శివ, ప్రవీణ్, సాయికుమార్, హరి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మాడ్గుల, వెల్దండ మండలాలకు చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. సీఎం సహాయనిధి పథకం పేదలకు వరమని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్‌రెడ్డి, మెకానిక్ బాబా, కృష్ణ, యాదయ్య, పోలెపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంగాదేవి కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ముదిరాజులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఈ నెల 31న జరగనున్న పెద్దమ్మతల్లి, గంగాదేవి కల్యాణ మహోత్సవానికి రావాలని కోరుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ముదిరాజ్ సంఘం పోల్కంపల్లి నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కావలి నర్సింహ, పూల శ్రీనివాస్, లక్ష్మయ్య, భిక్షపతి, బార్గవ్, నర్సింహ, పర్వతాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సేన గ్రామ కమిటీల ఎన్నిక

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో ఆదివారం బీసీ సేన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శోభారాణి, ఉపాధ్యక్షురాలిగా విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మంజుల, కోశాధికారిగా లక్ష్మి, కార్యదర్శిగా నాగమణి ఎన్నికయ్యారు. అదేవిధంగా కాస్లాబాద్ గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా అరుణ, ఉపాధ్యక్షురాలిగా అనిత, ప్రధాన కార్యదర్శిగా స్రవంతి, ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీ సేన మండల అధ్యక్షురాలు ప్యాట జయ, నాయకులు బాల్‌రాజు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: మండల పరిధిలోని వెలిజర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం, రామాలయం దేవాలయాల్లో గత మూడురోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో వివిధ గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ దొడ్డి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నర్సింలు, సభ్యులు అనిమి గణేశ్‌గౌడ్, తిరుపతియాదవ్, వెంకటేశ్, దొడల శివకుమార్, నాయకులు జాంగారి జంగయ్య, జగన్, జాంగారి రవి, సత్యంరెడ్డి, తుప్పరి శేఖర్, జంగయ్య, బాల నర్సింలు, మహేశ్‌యాదవ్, దొడల శ్రీనివాస్ యాదవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవలో శాస్త్రవేత్తలు

రైతు సేవలో వ్యవసాయ శాఖ నిమగ్నమవుతోంది. సాగుపై సరైన అవగాహన లేక ఏటేటా విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కొనుగోళ్ల విషయంలో రైతులు వ్యాపారులు, దళారుల చేతుల్లో మోసపోతున్న నేపథ్యంలో వాటిని కట్టడి చేయడానికి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సాగుకు కావాల్సిన సలహాలు, సూచనలు అందిస్తూ అన్నదాతలను చైతన్యపరుస్తోంది.



చౌదర్‌పల్లి రైతు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు(ఫైల్)

గ్రామాల్లో విస్తృతంగా అవగాహన సదస్సులు

- రైతు నమోదు కార్డులపై ప్రచారం
- పైలెట్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి
- వానాకాలం పంటల డిమాండ్‌పై అంచనా..

యాచారం: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం.. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం పేరుతో గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి నిత్యం ఒక్కో గ్రామానికి ఓ శాస్త్రవేత్తను పంపించి సాగులో అవగాహన కల్పిస్తోంది. విత్తనాల ఎంపిక, ధరలు, రశీదు పొందడం, పంటల్లో యూరియాను తక్కువ మోతాదులో వాడటం, నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడటం, సాగునీటిని ఆదా చేయడం, ఏటా పంట మార్పిడి అమలు చేయడం, తద్వారా పంటలో అత్యధిక దిగుబడి పొందడం, పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా చెట్లను పెంచడం తదితర అంశాలను వివరిస్తోంది. రైతు నమోదు గుర్తింపు కార్డుల ప్రాముఖ్యతను తెలుపుతోంది.

20 వేల ఎకరాల్లో సాగు

ప్రస్తుత వానాకాలం కింద యాచారం మండలంలోని 20 వేల ఎకరాల్లో వరి, పత్తి పంటతో పాటు కూరగాయలు, ఇతర పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఆయా పంటలకు సంబంధించి కావాల్సిన విత్తనాలు, ఎరువులను నిల్వ చేసే విధంగా బడ్జెట్‌ను రూపొందించింది. యాచారం పీఏసీఎస్‌తో పాటు యాచారం, మాల్ కేంద్రాల్లోని ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో వరి, పత్తి, కందులు, జొన్నల, సజ్జల విత్తనాలతో పాటు డీఏపీ, యూరియాను నిల్వ ఉంచాలని వ్యాపారులకు సూచించింది. విత్తనాలు, ఎరువుల ధరలతో కూడిన బోర్డును దుకాణాల ఎదుట ఉంచాలని, నిత్యం స్టాక్ నిల్వ తెలియజేసే విధంగా బోర్డులపై రాసి ఉంచాలని పేర్కొంది. నల్లవెల్లి, మాల్, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, చౌదర్‌పల్లి, అయ్యవారిగూడెం, చింతుల్ల, నందివనపర్తి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి, మాల్ తదితర గ్రామాల్లో పత్తి, పలు రకాల కూరగాయల పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు నిర్ణయించారు.

పైలెట్ గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ

కూరగాయలు, ఆకుకూరల సాగును పెంచి, రాష్ట్ర స్థాయిలో అమలు చేయాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ కమిషన్ యాచారం మండలం మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి, గడ్డమల్లయ్యగూడ గ్రామాలను దత్తత తీసుకుంది. మూడు గ్రామాల్లో సుమారు 150 మంది రైతులకు రాయితీపై డ్రిప్ పరికరాలు అందజేసింది. భవిష్యత్తులో మరింత ప్రోత్సాహం అందించేందుకు రైతు సంక్షేమ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ద్వారా ప్రతి రైతుకు సబ్సిడీపై యంత్ర పరికరాలు, డ్రిప్ ఇతర పరికరాలను అందించడానికి కృషి చేస్తోంది. నాబార్డ్ సహకారంతో రైతు సంక్షేమ కమిటీకి ఆర్థికంగా చేయూతనిస్తూ.. పైలెట్ గ్రామాల్లో కూరగాయలు, ఆకుకూరల సాగును విస్తృతం చేస్తోంది. జిల్లా వ్యవసాయ శాఖతో పాటు, ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారులు ఈ గ్రామాల్లోని రైతుల ఆర్థిక ప్రగతికి కృషి చేస్తున్నారు.



అన్నదాతలకు డ్రిప్ పరికరాలను అందజేస్తున్న ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారులు

చాలా బాగుంది



రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం బాగుంది. అనేక విషయాలు తెలుస్తున్నాయి. అయితే పత్తి విత్తనాల విషయంలో వ్యాపారుల చేతుల్లో మోసపోతున్నాం. వర్షాలు కురిసిన తర్వాత రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ధరలు పెంచి విక్రయిస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలి.

– గౌర నర్సింహ, రైతు చౌదర్‌పల్లి

పుదీనా రైతులకు గుర్తింపు ఇవ్వండి



పుదీన పండించే రైతులకు గుర్తింపు ఇవ్వండి. పంటకు కావాల్సిన పెట్టుబడిని ఉచితంగా అందించాలి. సాగుకు అందించే పశువుల ఎరువు, పురుగు మందుల విషయంలో ఆర్థికంగా ఆదుకోవాలి. మార్కెట్లో పుదీన విక్రయించేందుకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి.

– కొలన్ మల్లారెడ్డి, రైతు మొండిగౌరెల్లి

రైతుల నుంచి స్పందన



రైతుల ముంగింట్లో శాస్త్రవేత్తల కార్యక్రమానికి రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. శాస్త్రవేత్తలు ఇచ్చే సలహాలు, సూచనలు వింటున్నారు. రైతు కమిషన్ ఎంపిక చేసిన పైలెట్ గ్రామాల్లో రైతులందరికీ రాయితీపై డ్రిప్, ఇతర సాగు యంత్ర పరికరాలను అందిస్తున్నాం. అది వారికి ఎంతో మేలు.

– రవినాథ్, మండల వ్యవసాయ అధికారి

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలో పునరుద్ధరించిన శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో నేటి నుంచి రెండు రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా సోమవారం గణపతి పూజ, గోపూజ, స్వామివారికి అభిషేకం, సుదర్శనహోమం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన. ఈ నెల 20న గణపతిపూజ, మహాసుదర్శన హోమం, ఉదయం 11.34 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. ఉత్సవాల నేపథ్యంలో సోమ, మంగళవారం రాత్రి శృతిలయ కల్చరల్ అకాడమీ, వందేమాతరం ఫౌండేషన్, ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టనున్నారు. ఉత్సవాలకు భక్తులు భారీగా తరలి వచ్చి, స్వామివారిని దర్శించుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ కోరారు.



నర్సింహస్వామి దేవాలయం

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన వార్డు మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వస్పుల సాయిలు తల్లి మైసమ్మ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు సాయిలును పరామర్శించారు. మైసమ్మ మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, కాంగ్రెస్‌మండల మాజీ అధ్యక్షుడు రాములు, నాయకులు ఖాదర్‌ఖాద్రి, చంద్రయ్య ఉన్నారు.

ఇన్‌చార్జిలతోనే పురపాలన

- కమిషనర్ మినహా.. మేనేజర్, టీపీఓ, సీనియర్ అసిస్టెంట్ డిప్యూటేషన్‌పైనే..
- వార్డు అధికారులే.. బిల్ కలెక్టర్లు
- మున్సిపాలిటీని వేధిస్తున్న సిబ్బంది కొరత



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ పాలన డిప్యూటేషన్, ఇన్‌చార్జి అధికారులతోనే సాగుతోంది. కమిషనర్ మినహా.. డిప్యూటేషన్‌పై మేనేజర్, టీపీఓ, సీనియర్ అసిస్టెంట్లు కొనసాగుతుండగా.. మూడు బిల్ కలెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆస్తి పన్ను వసూలులో వా ర్డు అధికారులే టార్గెట్‌ను పూర్తి చేయాల్సిన దుస్థితి.

2013 మార్చిలో..

గ్రామ పంచాయతీ నుంచి 2013 మార్చిలో సీతారాంపేట, ఖానాపూర్, శేరిగూడ గ్రామాలను కలుపుకొని ఇబ్రహీంపట్నం నగర పంచాయతీగా 20 వార్డులతో ఆవిర్భవించింది. 2018లో మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది. వార్డుల పునర్విభజనతో కొత్తగా మరో నాలుగు వార్డులు ఏర్పడ్డాయి. సుమారు 50 స్క్వేర్ కిలోమీటర్ల పరిధి ఈ మున్సిపాలిటీకి ఉంది.

శరవేగంగా అభివృద్ధి

నగరానికి కేవలం 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. అతి సమీపాన అవుటర్ రింగ్ రోడ్డు, కొంగరకలాన్‌లో కలెక్టరేట్, ఆదిబట్లలో టీసీఎస్, ఏరోస్పేస్‌లు ఉండగా, బీడీఎల్, ఆక్టోపస్, ఎన్ఎస్‌జీ, బీఈఎల్, వైట్ గోల్డ్, ప్రైవేట్, ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలు ఈ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాయి. దీంతో కొత్తగా వ్యాపార, వాణిజ్య, గృహ నిర్మాణాలు జోరందుకున్నాయి.

ఏఈకి అదనపు బాధ్యతలు

ఇక్కడి ఏఈ గుణాకర్ తుక్కుగూడ మున్సిపల్ ఇన్‌చార్జి ఏఈతో పాటు శంకర్‌పల్లి, ఆమనగల్లు, కొత్తూరు మండలాలకు మిషన్ భగీరథ పబ్లిక్ హెల్త్ ఏఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో పనిభారం ఎక్కువై, సరైన సమయం కేటాయించలేకపోతున్నారు.

సీనియర్ అసిస్టెంట్ డిప్యూటేషన్ అధికారే..

నల్గొండ మున్సిపల్ కార్యాలయ రెగ్యులర్ సినియర్ అసిస్టెంట్ శివలింగం.. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో డిప్యూటేషన్ అధికారిగా కొనసాగుతున్నారు. ఆర్ఓ, ఆర్ఐ పోస్టులు మంజూరులేని కారణంగా కొత్త, పాత నిర్మాణాల ఆస్తి పన్ను విధింపు, వసూలు వ్యవహార బాధ్యతలను ఆ అధికారే నిర్వహిస్తున్నారు.

మేనేజర్, అకౌంటెంట్ పోస్టుల్లో అంతే..

మున్సిపల్ మేనేజర్ గిరిజ సుమారు ఏడాదిన్నర క్రితం కొడంగల్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌రెడ్డి మేనేజర్‌గా కొనసాగుతున్నారు. తుర్కయంజాల్ మున్సిపల్ రెగ్యులర్ అకౌంటెంట్ ఉష.. పెద్ద అంబర్‌పేట, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలకు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఆ రెండు పెద్ద మున్సిపాలిటీలు కావడంతో ఆమె ఇక్కడ సరైన సమయం కేటాయించలేకపోవడంతో.. ఆమె అవసరం తమకు లేదని కమిషనర్ లిఖితపూర్వకంగా తెలిపారు. ఆ స్థానంలో జూనియర్ అకౌంటెంట్ క్రాంతికుమార్‌ను నియమించారు.

బిల్ కలెక్టర్ల పోస్టులు ఖాళీ

మూడు బిల్ కలెక్టర్ల పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఆస్తి పన్ను వసూలు సందర్భంలో అవుట్ సోర్సింగ్, వార్డు ఆఫీసర్లు బిల్ కలెక్టర్లుగా కొనసాగుతున్నారు. ప్రధాన అధికారులపై అదనపు భారం మోపడంతో వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే ఈ మున్సిపాలిటీకి వచ్చిపోతుండటంతో పరిపాలన పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్పెషల్ గ్రేడ్ అధికారి రవీంద్రసాగర్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలను నిర్వహిస్తూ, అన్నిపనులు చూసుకోవాల్సి రావటం గమనార్హం.

ఇబ్బంది పడుతున్నాం



అధికారుల కొరతతో ఇబ్బంది పడుతున్నాం. తుర్కయంజాల్, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలకు కలిపి ఒకే టౌన్ ప్లానింగ్ అధికారి ఉన్నారు. మున్సిపల్ ఏఈ గుణాకర్‌కు తుక్కుగూడతో పాటు భగీరథ పబ్లిక్ హెల్త్ ఏఈగా మరో మూడు మండలాలకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మేనేజర్ పోస్టుతో పాటు మరో మూడు బిల్ కలెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సీనియర్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో సేవలు అందిస్తున్నాం.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

ఒక్కడే టీపీఓ

షాద్‌నగర్ మున్సిపాలిటీ రెగ్యులర్ టీపీఓ దినేశ్.. తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలకు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. తుర్కయంజాల్, షాద్‌నగర్ పెద్దవి కావడంతో వారంలో రెండు రోజుల సమయాన్ని కూడా ఈ పురపాలికకు కేటాయించలేని దుస్థితి. దీంతో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నా.. ఆపేనాథుడే కరువయ్యాడు.

ప్రజాసేవే యావ

- 60 రోజులు.. నిత్యం వెయ్యిలీటర్లు
- 33ఏళ్లుగా బాటసారుల దాహం తీరుస్తున్న 'సత్యసాయి' చలివేంద్రం



ఆమనగల్లులో సత్యసాయిసేవా సమితి చలివేంద్రం

ఆమనగల్లు: ప్రజాసేవే సత్యసాయి సేవాసమితి యావ. నేనున్నానంటూ.. ప్రతి వేసవిలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి, చల్లటి నీటితో బాట సారుల దాహం తీరుస్తోంది. మూడు దశాబ్దాలుగా సేవలు అందిస్తూ.. ప్రజల మన్ననలు అందుకుంటోంది.

1992 నుంచి..

ఆమనగల్లు పట్టణంలో సేవాసమితి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా 1992 నుంచి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేస్తోంది. ప్రతి వేసవిలో రెండు నెలల పాటు రూ.80 వేల వరకు వెచ్చించి, రోజుకు వెయ్యి లీటర్లకు పైగా మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి ప్రజలకు పంపిణీ చేస్తోంది. ఇదిలా ఉండగా.. చలివేంద్రం నిర్వహణలో భాగంగా ఏటా ఏప్రిల్ 24న సత్యసాయి సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదానం, మే 6న ఆయన మాతృమూర్తి ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం మజ్జిగ పంపిణీ చేస్తారు.

అభినందనీయం



సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం నిత్యం వేలాది మంది బాటసారుల దాహార్తిని తీరుస్తోంది. ఆర్టీసీ బస్టాండ్‌లో నీటి వసతి లేకపోవడంతో ప్రయాణికులు, ఇతరులు దీనినే వినియోగించుకుంటున్నారు. సంస్థ సేవలు అభినందనీయం.

– మౌనిక, ప్రయాణికురాలు, ఇర్విన్

వేసవి ముగిసే వరకు..



ప్రయాణ ప్రాంగణంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. వేసవికాలం ముగిసే వరకు చల్లటి తాగునీటిని అందిస్తాం. సత్యసాయి ఆధ్వర్యంలో ప్రజల దప్పిక తీర్చడం సంతోషంగా ఉంది. సేవాసమితి సభ్యులు సేవాభావంతో పనిచేస్తున్నారు.

– దొంతు శ్రీనివాస్, కన్వీనర్, సేవాసమితి

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే తదితరులు

కడ్తాల్: మండల పరిధి న్యామతాపూర్ గ్రామంలో ఆదివారం శ్రీ మాత పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మికత, భక్తి భావం మరింత పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి రూ.6 లక్షలు విరాళం అందజేసిన మహేశ్‌ను సన్మానించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి పండుగలో నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, నాయకులు మహేశ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోపాల్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, రాములు, ఇర్షాద్, సురేశ్, వెంకటేశ్, రాములు పాల్గొన్నారు.

భక్తితో మానసిక ప్రశాంతత

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి



పూజలు చేస్తున్న వంశీచంద్‌రెడ్డి తదితరులు

కడ్తాల్: సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండల పరిధి న్యామతాపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆయనతో పాటు పలువురు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్ పర్సన్ యాటగీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్లు డాక్టర్ శ్రీను, చేగూరి వెంకటేశ్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, నాయకులు బోదాస్ మహేశ్, శ్రీశైలం, విఠలయ్యగౌడ్, ఫారుఖ్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, జంగయ్య, జహంగీర్‌అలీ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గూడూరు పుష్పమ్మ–నారాయణరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని ఆదివారం ఆయన సందర్శించి మాట్లాడారు. వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు అంబలి కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఇందులో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, మాజీ ఎంపీటీసీలు లక్ష్మయ్య, వెంకటేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్, మండల అధ్యక్షుడు రవి, నాయకులు జహంగీర్‌అలీ, మల్లేశ్‌గౌడ్, అజ్గర్‌అలీ, బాలరాజు, హీరాసింగ్, జవహర్‌లాల్, భానుకిరణ్, ముత్తి కృష్ణ, రాంచందర్‌నాయక్, నరేందర్, జగన్‌గౌడ్, శ్రీకాంత్, భరత్‌యాదవ్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

అంజిరెడ్డికి మాతృవియోగం

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు గ్రహీత, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మొద్దు అంజిరెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి లక్ష్మమ్మ ఆదివారం శేరిగూడలో కన్నుమూశారు. బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్.. లక్ష్మమ్మ పార్థీవ దేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధి అనాజ్‌పూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 8గంటలకు 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారిణి పల్లవి తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చేపట్టే కార్యక్రమంలో రైతులు పాల్గొని, సాగులో సందేహాలను నివృత్తి చేసుకోవాలని, సాగులో మెలకువలు తెలుసుకోవాలని సూచించారు.

బుద్ధుడి బోధనలను ఆచరిద్దాం

కొందుర్గు: గౌతమ బుద్ధుడి బోధనలను అందరం ఆచరిద్దామని బీఎస్పీ మండల మాజీ అధ్యక్షుడు రాధాకృష్ణ అన్నారు. బుద్ధుడి జయంతిని పురస్కరించుకొని మండలంలోని పర్వతాపూర్‌లో ఆదివారం బుద్ధ జ్ఞానసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. బుద్ధుడు అహింసా మార్గంలో నడుచుకోవాలని సూచించారన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని సూచించిన మహనీయుడు గౌతమ బుద్ధుడన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీన్‌కుమార్, విద్యాసాగర్, రాజు, భీమయ్య, కృష్ణ పాల్గొన్నారు.